క్లుప్తంగా

అధికార ప్రతినిధిగా బాలాజీ సింగ్

కల్వకుర్తిరూరల్/వెల్దండ: రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధిగా నాగర్‌కర్నూల్ జిల్లా వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి బాలాజీకి నియామకపత్రం అందజేశారు. వెల్దండ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాలాజీసింగ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

అచ్చంపేట రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. గురువారం అచ్చంపేటలోని వివిధ వార్డులలో బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజును అధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కౌన్సిలర్లు తగురం శ్రీనివాసులు, మనోహర్‌ప్రసాద్, శివ, నాయకులు ఖలీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొల్లాపూర్: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామస్వామియాదవ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పట్టణంలో జూపల్లి కృష్ణారావును గెలిపించాలని కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం చేశారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు రాజాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

బీఎస్పీతోనే రాజ్యాధికారం

నాగర్‌కర్నూల్‌రూరల్: బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్‌కు మద్దతుగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభలో బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని ప్రసంగిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జెడ్పీగ్రౌండ్‌లో సభ ఉంటుందని పేర్కొన్నారు.

తాడూరు: బీఎస్పీతోనే రాజ్యాధికారం సాధ్యమని నాయకుడు కొ్ట్ర బాలు అన్నారు. గురువారం మండలంలోని సిర్సవాడ, ఇంద్రకల్ గ్రామాల్లో నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో పృథ్వీ, వెంకటయ్య, నిరంజన్, బంగారయ్య పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను తిరస్కరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: మతోన్మాద శక్తులను ఎన్నికల్లో తిరస్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓటు వేయొద్దని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, దేశ్యానాయక్, కందికొండ గీత, ఆంజనేయులు, మల్లయ్య, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

అమ్రాబాద్: అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఖైరత్, శేఖర్, అజీమ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వీరబాబుకు ఫిర్యాదు చేశారు.

నిర్భయంగా ఓటు వేయాలి



బల్మూర్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



చారకొండలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సోమనర్సయ్య, సిబ్బంది.

- బల్మూర్, కొండనాగులలో పోలీసు కవాతు

బల్మూర్: వచ్చే ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అచ్చంపేట డీఎస్పీ కృష్ణకిషోర్ కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు కొండనాగుల గ్రామాల్లో పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు ర్యాలీలు నిర్వహించారు. ఓటర్లు డబ్బు, మద్యం ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐలు అనుదీప్, ఆదిరెడ్డి, ఎస్ఐలు శేఖర్‌రెడ్డి, గోవర్ధన్, వీరబాబు, తిరుపతిరెడ్డి, గురుస్వామి, శేఖర్‌గౌడ్,శ్రీనువాసులు, సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ..

చారకొండ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం సీఐ సోమనర్సయ్య ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక కేంద్ర బలగాలు తదితరులు ఉన్నారు.

లింగాల: మండల కేంద్రంలో పోలీస్ బలగాల కవాతు నిర్వహించారు. ఓటర్లలలో మనో ధైర్యం నింపేందుకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ను జరిపినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన మహిళతో పాటు కుమార్తె, కుమారుడితో అదృశ్యంపై భర్త రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్టోబర్ 28న మహిళ శిరీష కుమార్తె పౌర్ణమి, కుమారుడు శివమల్లేష్‌లను తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. గురువారం మహిళ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన విప్పలపల్లి శేఖర్ కొన్ని రోజుల అనారోగ్యంతో మృతి చెందాడు. 1984–85 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పోగు చేసిన రూ.30 వేలను గురువారం స్నేహితుడు శేఖర్ భార్యకు అందజేశారు. సర్పంచ్ రవిశంకర్, పరుశరామరాజు, బాలరాజు, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, ఉమాదేవి, జయశ్రీ, హైమావతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మన్ననూర్: అమ్రాబాద్–మద్దిమడుగు ప్రధాన రహదారిపై అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గ్రామానికి చెందిన రజాక్ టీవీఎస్‌పై మన్ననూర్ నుంచి స్వంత గ్రామానికి వెళ్తున్నాడు. అంబేద్కర్ కాలనీ వద్దకు రాగానే కుక్కలు టీవీఎస్‌కు తగలడంతో కిందపడి రజాక్‌కు తీవ్రగాయాలయ్యాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం గ్రామ సమీపంలో ఉన్న శ్రీవారి సముద్రం చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలవెంకటరమణ వివరాల ప్రకారం శ్రీవారి సముద్రంలో చెరువులో మహిళ మృతదేహం కన్పించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశామని పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి

తాడూరు: తరగతి గదిలో విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇంద్రకల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యా సామర్థ్యాలను పెంచాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎంలు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌పీ శ్రీను, ఆంజనేయులు, నరేందర్ పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూత

కల్వకుర్తిరూరల్: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రజల భాగస్వామి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు కల్వకుర్తి ప్రింట్ మీడియా అసోసియేషన్ ఆసరా అందించింది. వృద్ధులకు బియ్యం, పండ్లను అందజేసి చేయూతనిచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీధర్, కృష్ణయ్య, రాజు, ఫయాజ్, రాజేష్, మాజీబ్ తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టు పరిశీలనకు డిగ్రీ విద్యార్థులు

అమ్రాబాద్: ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల విద్యార్థులు పరిశీలించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సేవాపథకంలో భాగంగా ప్రతి శనివారం పదిహేను పాఠశాలలను డిగ్రీ కళాశాల విద్యార్థులు పరిశీలించి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సులభతరంగా అక్షరాలు, అభ్యసన అందేవిధంగా వివరిస్తారన్నారు. అనంతరం విద్యాశాఖ ద్వారా వచ్చిన బోధన అర్హత పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై శ్రద్ధ



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ గంగమోహన్ అన్నారు. గురువారం మండలంలోని లచ్చిరాంతండా, ఇంద్రకల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వార నిర్వహిస్తున్న నర్సరీలలో సారవంతమైన మట్టితో బ్యాగ్ ఫిల్లింగ్ చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను నర్సరీలలో ఉంచి ప్రతి రోజు నీటిని అందించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోసిపోయిన సర్వసభ్య సమావేశం

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ప్రజాప్రతినిధులు లేక బోసిపోయింది. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పూర్తిస్థాయిలో సభకు హాజరు కాలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశానికి రాకుండా గ్రామాల్లోనే ఉండిపోయారు. అధికారులు కూడా చేసేది ఏమి లేక 5 శాఖల అధికారులు నివేదికలు చదివి వెళ్లిపోయారు. సమావేశంలో ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో కరుణశ్రీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎన్నికల సెక్టోరియల్ అధికారి, ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా బైరాపూర్, గుండాల, అజిలాపూర్, చెదురుపల్లిలో కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించాలని, ట్రైసైకిల్ అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీ,మంజుల తదితరులు ఉన్నారు.

రోడ్డు గుంతలో ఇరుక్కున్న డీసీఎం

బిజినేపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం ఓ డీసీఎం వాహనం రోడ్డు గుంతలో ఇరుక్కుపోయింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా టిప్పర్ల నుంచి ఒండ్రు మట్టిని తరలించడంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. టిప్పర్ల బరువుకు రోడ్లు కుంగిపోతున్నాయని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంతోపాటు, నియోజకవర్గంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పాటు, మెడికల్ కళాశాల, సాగునీరుతో పాటు రూ.వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్‌కు జిల్లాపై ఉన్న ప్రత్యేక ప్రేమతోనే అభివృద్ధి సాధ్యమయ్యిందన్నారు. గతంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చానని, ప్రస్తుత మేనిఫెస్టోలోని హామీలను నూరు శాతం అమలుపరుస్తానని చెప్పారు. జిల్లాకేంద్రంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు, ఐటీ హబ్, నూతన పరిశ్రమలు, మండలానికి ఒకటి చొప్పున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి రైతులు, మహిళలకు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. 9 ఏళ్లకు ముందు, ప్రస్తుతం మారిన నియోజకవర్గ రూపురేఖలను గమనించి తనను మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు.

19 సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..

ఈనెల 19న జిల్లాకేంద్రం సమీపంలోని ఉయ్యాలవాడ శివారులో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'కు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జక్కా రఘునందన్‌రెడ్డి, బైకని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆదరించండి..

తెలకపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని పర్వతాపూర్, గౌరారం, దాసుపల్లి గ్రామాలతో పాటు రాత్రి వట్టిపల్లి, బొప్పల్లి, ఆలేరు గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు వంటి పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలన్నారు. సొంత ఖర్చులతో రూ.5కే భోజనం, సామూహిక వివాహాలు, పలు సేవ కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. గౌరారం నుంచి కార్వంగకు, పర్వతాపూర్, గ్రామాలకు బీటీ రోడ్డు పూర్తి చేస్తామన్నారు. మెడికల్ కళాశాల, మినీట్యాంక్‌బండ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గోరెటి వెంకన్న మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మర్రికి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బైకానీ శ్రీనివాస్ యాదవ్, నాగం జనార్దన్‌రెడ్డి తనయుడు నాగం శశిధర్‌రెడ్డి, ఎంపీపీ కొమ్ము మధు, సర్పంచ్ జమ్ములు, ఎంపీటీసీ జంగమ్మ, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు ఈదుల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మాట ఇస్తే నిలబెట్టుకుంటా'



జమ్మాపూర్‌లో పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



సూర్యనాయక్‌తండాలో పార్టీ చేరిన నాయకులతో బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెంట్లవెల్లి: తాను ఒకసారి మాట ఇస్తే తప్పకుండా వాటిని నిలబెట్టుకుంటా అని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతా అనిఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మల్లేశ్వరం, ఎంగంపల్లితండా, కొండూరు, తడకలతండా గ్రామాల్లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వేముకల్, ఎంగంపల్లి, మల్లేశ్వరం గ్రామాలకు రెండేళ్ల లోపే బ్రిడ్జి నిర్మాణం చేపట్టానని తెలిపారు. రూ.33 కోట్లతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్‌ను కొద్ది రోజుల క్రితమే ప్రారంభించామన్నారు. కృష్ణానది మధ్యలో ఉన్న పెద్ద గుట్టను త్వరలోనే ఐలాండ్‌గా మారుస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు, గిరిజనులు, మహిళలతో కలిసి గిరిజన సాంప్రదాయంతో నృత్యం చేశారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కలిసి కట్టుగా పనిచేస్తూ విజయం సాధించాలని నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 19వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు జన సమీకరణపై చర్చించారు. మునీరొద్దీన్, వెంకటయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయక్, తిరుపతయ్యసాగర్

ఓటు ద్వారా జూపల్లికి గుణపాఠం చెప్పాలి

కొల్లాపూర్ నియోజకవర్గాన్ని 19ఏళ్లు పాలించి ఎలాంటి అభివృద్ధి చేయని జూపల్లికి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జమ్మాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు జ్యోతినందన్‌రెడ్డి, నాగరాజు, నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

కోడేరు: బీరం హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యాపచెట్టు లాలు, మిద్దె రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు..

మండలంలోని నార్యనాయక్ తండాకు చెందిన వార్డు సభ్యులు రాత్లావత్ చందు, రాజనాయక్, కృష్ణనాయక్, దేవ్లానాయక్ తదితరులు గురువారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం గంట్రావ్‌పల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బాబురావు, అరవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



పార్టీ కండువా కప్పుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాండ్ర, జూపల్లి గ్రామాల్లో కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్తూ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ఒక ఏడాదిలోనే లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. దొరల పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం అయ్యిందన్నారు. పేదలకు సంక్షేమాన్ని విస్మరించిన సీఎం కేసీఆర్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. నిత్యవసర ధరలను నియంత్రించకుండా పేదల నడ్డివిరిచిందని ఆరోపించారు. వివిధ హామీలతో సీఎం కేసీఆర్ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ హామీలను నమ్మొద్దని వివరించారు. బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని మార్పు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆశాదీప్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. అనంతరం జూపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన వెంట సర్పంచ్, వైస్ ఎంపీపీ వెంకటయ్య యాదవ్, తదితరులు ఉన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లిలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎండీ సిరాజ్ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వెంకటయ్య యాదవ్, ముజ్జు, బాలరాజు తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆశాదీప్‌రెడ్డి

హెయిర్ సెలూన్ దగ్ధం.. రూ.2 లక్షల నష్టం



కాలిన సామగ్రిని చూపుతున్న బాధితుడు

అమ్రాబాద్: విద్యుదాఘాతంతో హెయిర్ సెలూన్ దగ్ధమైన ఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు యాదగిరి కథనం మేరకు.. పదరకు చెందిన గోలి యాదగిరి వివేకానంద విగ్రహం ఎదుట మద్దిమడుగు రహదారిపై హెయిర్ సెలూన్ దుకాణం నిర్వహిస్తున్నారు. రోజులాగే బుధవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున దుకాణంలో నుంచి మంటలు వస్తున్నాయని పరిసర ఇళ్లవారు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. అప్పటికే సెలూన్‌లోని కుర్చీలు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు యాదగిరి వివరించారు.

వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన పుర పరిధిలోని నాగనూలు శివారులో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన పరమేశ్వర్ (48) పని నిమిత్తం నాగనూలుకు వెళ్లి తిరిగి వస్తుండగా శివారులో ఉన్న కాల్వ వద్ద చనిపోయి కనిపించాడు. గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరమేశ్వర్ గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తా



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్ రావు

కొల్లాపూర్ రూరల్: నియోజకవర్గానికి 100 పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని కొల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్ రావు అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యాదవులను ఓటుబ్యాంక్‌గా వాడుకున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇస్తే కొల్లాపూర్‌కు రైల్వేలైన్‌తో పాటు పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి అవుతారని అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ధర్మాన్ని కాపాడుతున్న పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు శ్రీకృష్ణుడు, బీసీ మండల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు..

కొల్లాపూర్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బహుజన ముక్తి పార్టీ తరపున నామినేషన్ వేసి విత్‌డ్రా చేసుకున్న చుక్కాయిపల్లి బింగి సాయన్నతో పాటు పలువురు ఎల్లేని సుధాకర్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. సింగోటం రామన్న, శ్రీనివాస్‌యాదవ్, కాశీపురం మహేష్, సాయికృష్ణగౌడ్ తదితరులున్నారు.